# దేవీ రూపం

- ఆర్. ఎస్. హైమవతి

తన మనవరాలు సంధ్యతో ఆడుకుంటున్న పిల్లల్ని ఇంట్లోకి పిలిచింది అనసూయ. “అమ్మాయిలూ ఒకసారి ఇలా లోపలికిరండమ్మా!” అంటూ.

మామ్మగారు పిలిచినదే తడవుగా అమ్మాయిలు పరిగెత్తుకొచ్చారు. వాళ్ళకి సంధ్య వాళ్ళ మామ్మ అన్నా, ఆవిడ కబుర్లు, కథలు అన్నా చాలా ఇష్టం. అందుకే “మీ మామ్మగారు చక్కగా ఎన్నో కథలూ, కబుర్లూ చెప్తూ ఉంటారు. మా మామ్మ అయితే ఎప్పుడూ టీ.వి. సీరియళ్ళు చూస్తూ వాళ్ళతో పాటుగా ఏడుస్తూ ఉంటుంది” అని రమ సంధ్యతో అంటే “మా మామ్మ అంతే!” అన్నారంతా.

“మా మామ్మ అన్నీ చక్కగా చెప్తుంది. నిజమే! కానీ, మా అమ్మ సరిగ్గా విననియ్యదు. ఎప్పుడూ క్లాసు పాఠాలు చదవమంటూ మామ్మ దగ్గర్నుంచి నన్ను లాక్కెళ్ళి పోతుంది.” అని అంది సంధ్య.

“ఎందుకు?మామ్మా పిలిచావు!” అంటూ సంధ్య, వెనకాలే ఆమె స్నేహితురాళ్ళూ రావడంతో “కూచోండర్రా! నేనొక ఫొటో చూపిస్తాను. బాగుందా చెప్పండి” అంది అనసూయ.

“ఏ ఫొటోనే?”అడిగారు స్నేహితురాళ్ళు సంధ్యని.

“ఏమోనే!నాకూ తెలియదు. ఏం చూపిస్తుందో?” అంది సంధ్య.

అనసూయమ్మ చేతిలో ఫొటోతో లోపలినించి వచ్చింది. “ఇదిగోనర్రా! ఈ ఫొటోలో అమ్మాయి ఎలావుంది? చెప్పండి.” అంది.

అందరూ ఆ ఫొటోమీద వాలిపోయి ఒక్కొక్కరూ లాక్కుని మరీ చూశారు. “చాలా బాగుంది మామ్మగారూ! ఎవరీ అమ్మాయి?” అని అడిగారు అంతా ఒక్కసారిగా.

www.sirimalle.com

"చెప్పుకోండి చూద్దాం!" కవ్వించింది మామ్మగారు.

"పువ్వులజడ, సంప్రదాయ దుస్తులతో ఎంతబాగుందో!" అన్నారు అంతా.

"నువ్వే చెప్పు మామ్మా!మాకు తెలియడంలేదు." అన్నారు.

"ఆ డ్రెస్సుని పరికిణీ, జాకెట్టు అంటారర్రా!" అందులో ఉన్నది ఎవరోకాదు. నేనే!" అంది అనసూయమ్మ.

"ఆ! మీరా?" అంటూ అంతా ఒక్కసారిగా నోళ్ళు వెళ్ళబెట్టారు. "అవునర్రా!నేనే! అప్పుడు నాకు పదేళ్ళు. అదే నేను కట్టుకున్న మావాళ్ళు కుట్టించిన ఆఖరు పరికిణీ! తరవాత కొన్నాళ్ళు ఓణీలు, తరవాత ఇక చీరలే! ఇంతకీ నేను మిమ్మల్ని ఎందుకు పిలిచానంటే, నేను మీకు ఇలాంటి పరికిణీలు కుట్టిస్తే మీరు వేసుకుంటారా? అని అడగడానికి." అంటూ ముగించింది.

పిల్లలందరూ ఆనందంగా "ఓ!" అంటూ సరదాపడ్డారు. ఇంతలో ఇదంతా వింటున్న ఆమె కోడలు రాజీ వచ్చి "ఏమిటత్తయ్యా! మీ చాదస్తం కానీ వీళ్ళంతా మీ పాతకాలం డ్రెస్సులు వేసుకుంటారా? ఎందుకు? మీకు అనవసరపు ఖర్చు, శ్రమ." అని అంది.

"అలా అనుకుంటే ఎలాగమ్మా? రాజీ! వచ్చేది దసరాపండుగ. ఒక్కొక్కరోజు ఒక్కొక్క కన్యకి అంటే పదేళ్లలోపు పిల్లలకి పూజచేసి బట్టలుపెట్టి సత్కరించాలని నాకు ఎప్పటినించో కోరిక. మా అమ్మ, మామ్మ ప్రతి ఏడాదీ, దసరాల్లో దేవీ రూపాలైన అమ్మాయిలని అలా పూజించేవారు. నాకు ఇన్నాళ్ళూ వీలుకాలేదు. ఇక వృద్ధాప్యం వలన ఓపిక కూడా తగ్గిపోతోంది. అందుకే ఈసారి నేను చేసుకుంటానంటే మీ మామగారు అభ్యంతరం లేకుండా వెంటనే సరే నన్నారు. అందుకే ఈ సారి ఎలాగైనా వీళ్ళందరికీ బట్టలు కుట్టించి సత్కరించాలనుకుంటున్నాను." అంది అనసూయమ్మ.

"మామ్మా!నాకూ కుట్టిస్తావుకదూ!" అంది సంధ్య ఆశగా.

"ఓ!! నీకు లేకుండానా తల్లీ !"అంది ఎంతో ఆప్యాయంగా.

********

"చూసారా? మీ అమ్మగారి పని. మన సంధ్యతో ఆడుకోడానికి వచ్చే చుట్టుపక్కల ఇళ్ళవాళ్ళ పిల్లలందరికీ పండగకి బట్టలు కుట్టిస్తున్నారు." అని మరుసటి రోజు రాత్రి భర్తతో అంది రాజీ.

"నీకెవరు చెప్పారు? నువ్వు చూశావా?" అడిగాడు నారాయణ.

"ఎవరోకాదు ఆవిడే చెప్పారు. ఆపిల్లలతో కూడా 'నేనిలాంటివి కుట్టిస్తే కట్టుకుంటారా?' అంటూ ఆవిడ చిన్నప్పటి ఫొటోలో ఉన్న పరికిణీ, బుట్టచేతుల జాకెట్టు చూపించారు."

"వాళ్ళేమన్నారు? కట్టుకుంటామన్నారా?"

"ఆ!ఎందుకనరు. తేరగా వస్తే వద్దంటారేమిటి?"

"అలా అనకు రాజీ! పిల్లలు దైవసమానులు వాళ్ళకి అలాంటి భావాలుండవు."

"సరే! అమ్మకు తగ్గ కొడుకు. పిల్లలు దైవసమానులు అందుకే ఈ నవరాత్రులూ ఒక్కొక్కరికీ ఒక్కోరోజు బట్టలు పెడుతుందిట. నిన్ననే మావయ్యగారితో రిక్షాలో వెళ్ళి బట్టలుకొని టైలరు కిచ్చి వచ్చారు."

"పోనీలే! ఏదో పుణ్యకార్యం చేయాలనుకుంటోంది" అన్నాడు నారాయణ.

"బాగానేవుంది సంబరం. అంత డబ్బు ఖర్చు పెట్టి వాళ్ళందరికీ కొనే బదులు ఆ డబ్బుతో మీకు, నాకు, మనపిల్లలకి మంచి బట్టలు కొనచ్చుకదా! మన సంధ్య కూడా సిగ్గులేకుండా అడిగింది 'నాకు కూడా కొంటావా మామ్మా?' అని" "ఇందులో సిగ్గులేకపోవడానికేముంది? అది చిన్న పిల్ల. కల్ల కపటం తెలియదు కనుక తిన్నగా అమ్మనే అడిగింది అంతేకానీ నీలా వెనకాల తిట్టుకోవడం తెలీదు!" అన్నాడు.

"అనండి అనండి నేనేగా మీకు లోకువ." అని రాజీ కొంచెం నొచ్చుకొంది.

"అదికాదు. నువ్వే ఆలోచించు. ప్రతీసారీ మనకి అమ్మ కొనివ్వడం లేదా? కొందరు తల్లిదండ్రులలాగా అమ్మా, నాన్న 'అదివ్వలేదు ఇదికొనిపెట్టలేదు' అంటూ మనల్ని ఏనాడూ సాధించలేదు. ఒప్పుకుంటావా?"

"వాళ్ళకి పెన్షను వస్తుందిగా! మనమెందుకు కొనాలి?"

“అవునా? మరైతే వాళ్ళూ మనకి పెద్ద ఉద్యోగం, మంచి ఆదాయం ఉందిగా! మనమెందుకు ఇవ్వాలి? అనుకోవచ్చు కదా! అయినా వాళ్ళు మనకి సంతోషంగా ఉన్నదాంట్లోనే మనల్ని మరింత సంతోష పెట్టాలని ఇస్తున్నారు. ఇప్పుడు దసరా సందర్భంగా కన్య పిల్లలకి ఇవ్వాలనిపించింది. అందులో తప్పేముంది. ఇష్టముంటే నువ్వు అమ్మకి సాయం చెయ్యి లేకపోతే ఊరుకో!” అన్నాడు స్థిరంగా నారాయణ. ఇక ఏమీ అనలేక అటు తిరిగి పడుకుంది రాజీ.

*******

దసరాలు మొదలైనదగ్గిర్నించీ ఒక్కొక్కరోజు ఒక్కొక్కరి ఇంటికి వెళ్ళి అనసూయమ్మ “ఇవాళ మీ అమ్మాయిని మా యింటికి పంపండి. ఆమెని ఈ రోజు కన్య ముత్తైదువగా పూజించాలనుకుంటున్నాను.” అంటూ పిలవనారంభించింది. 'ఏదో! పెద్దావిడ పాపం పిలుస్తోంది. ఈరోజుల్లో ఇలా ఇళ్ళకొచ్చి బొట్టుపెట్టి పిలిచేవారెవరు?' అనుకుంటూ ఆ ఇంటివారు వారి పిల్లల్ని పంపారు ఆనందంగా! పిలిచినప్పుడే అనసూయమ్మ పిల్లలకి తలంటిపోసి పంపమని కాసిని కుంకుడుకాయలు, నలుగు పిండి, చిన్నగిన్నెడు మంచినూనె అందరికీ పంచింది. పాతకాలపు పద్ధతిని తిరిగి ప్రారంభిస్తున్నందుకు అందరూ తమ చిన్ననాటి సంగతులు తలుచుకుని ఆనందంగా అంగీకరించారు. తమపిల్లల్ని పంపడానికి.

*******

పాడ్యమి రోజు నుండి రోజుకొకర్ని చొప్పున అనసూయమ్మ పిలిచిన అమ్మాయిలు పొద్దున్నే తలంటి నీళ్ళుపోసుకుని మోడరన్ డ్రెస్సుల్లో వస్తున్నారు. వాళ్ళని అనసూయమ్మ కూచోమని తినడానికి ముందుగా ఫలహారంపెట్టి పిమ్మట వాళ్ళ చేతులు, కాళ్ళు తనే కడిగి పిమ్మట కాళ్ళకి పసుపు రాసి పారాణి పెడుతుంది. చేతులకీ, మెడకీ గంధం పూస్తుంది. తలదువ్వి జడవేసి వాళ్ళ జడ మరీ చిన్నదిగా ఉంటే తన సవరం పెట్టి పెద్ద జడవేసి ఏరోజుకారోజు కొనివుంచిన పూలతో జడకుట్టి పైన పూలదండ పెట్టి అందంగా అలంకరిస్తుంది. తరవాత వాళ్ళకి కుంకుమతో బొట్టుపెట్టి తను కుట్టించిన పరికిణీ, జాకెట్టు ఇచ్చి కట్టుకోమంటుంది. చేతకాని మరీ చిన్నపిల్లలకి తనే దగ్గిరుండి కడుతుంది.

www.sirimalle.com

వాళ్ళతోపాటు తన మనవరాలు సంధ్య సరదాపడుతోందని దానికీ రోజు ఈ అలంకారాలన్నీ చేస్తోంది. “దానికెందుకే?దాన్నీ కన్య ముత్తైదుల్లో లెక్కేస్తున్నావా?మన పిల్లల్ని మనం లెక్కేసుకోడం సరికాదుకదా!” అన్నారు అనసూయమ్మ భర్త రామేశంగారు.

“అవునండీ!మనపిల్ల మనకి లెక్కకి రాదు. నిజమే! అయినా తోటివాళ్ళకి చేస్తూంటే దానికీ సరదాగా ఉంటుంది కదా!” అంది అనసూయమ్మ.

దసరా పదిరోజులూ శెలవులు ఉండవు కనుక పిల్లల స్కూలుకి శెలవులు ఉన్నరోజుల్లో ఈ తతంగమంతా ఉదయంపూట చేసేది. స్కూల్ ఉన్న రోజుల్లో సాయంకాలం పూట చేసి వాళ్ళకి భోజనం పెట్టి తరవాత తాంబూలంలో దక్షిణతో పాటుగా ఏదో పండు పెట్టి ఇచ్చి ఆ పిల్ల పాదాలని దేవీ రూపంగా మనసులో తలుచుకుని దండం పెడుతుంది. భార్య మనసుని అర్థం చేసుకున్న రామేశం తనూ ఆ పాపల పాదాలకి దండంపెట్టాడు. తల్లిదండ్రులు చేస్తూన్న పని నచ్చి నారాయణ కూడా వాళ్ళ పాదాలకి దండంపెట్టాడు. ఇదంతా చూసి వాళ్ళ పిల్లలు సంధ్య, అన్నరామూ కూడా దండం పెడుతుంటే ఇష్టం లేకపోయినా రాజీ కూడా దండం పెట్టింది.

ఇక ఆఖరు రోజు విజయదశమి నాడు మరో అమ్మాయి దొరకలేదు అనసూయమ్మకి. ఆవిడ మనసు మనసులో లేదు. “ఇంతవరకూ అనుకున్నది అనుకున్నట్లు నిర్విఘ్నంగా జరిగింది. మరి ఈ రోజు ఎలా?ఎవరూలేరు!” అనుకుంటూ తిండీ తిప్పలూ మాని బాధ పడుతున్న అనసూయమ్మకి వాకిట్లో “అమ్మా!”అన్న పిలుపు వినపడి వాకిట్లోకి వెళ్ళి చూసింది.

ఎవరో పేదపిల్లలా ఉంది. బట్టలు చిరిగి ఉన్నాయి. “ఎవరమ్మా?నువ్వు!” అంది ఆనందంగా అనసూయమ్మ. ఆమెకళ్ళకి ఆపిల్ల సాక్షాత్తూ దేవీ రూపం గానే కనబడుతోంది. ఇంతలో లోపల్నించి రాజీ గబగాబా వచ్చి ఆ పేదపిల్ల చేతిలో ఓ రూపాయి పెట్టి “వెళ్ళు వెళ్ళు అడుక్కోడానికి వేళా పాళా లేదూ?” అంటూ కసిరింది.

“ఉండమ్మారాజీ! ఈరోజు పూజకి అమ్మాయిలెవరూ లేరని నేను బాధపడుతున్న సమయంలో ఈ అమ్మాయి వచ్చింది. ఆదుర్గాదేవే ఈ అమ్మాయిని పంపిందనిపిస్తోంది.” అంది అనసూయమ్మ.

www.sirimalle.com

“బాగుందత్తయ్యా! అయితే ఈముష్టిదానికి పూజ చేస్తారా?” అంది రాజీ.

“చేస్తే తప్పేమిటమ్మా? పుట్టుకతో ఎవరూ ముష్టివాళ్ళుగాను, ధనవంతులు గాను పుట్టరుగా! వాళ్ళ వాళ్ళ పరిస్థితులనిబట్టి ఆయాపనులు చేయాల్సివస్తుంది.” అంటూ ఆ పిల్లని లోపలకి పిలిచి తనే ఆ పిల్లకి స్వయంగా తలంటిపోసి కొత్తబట్టలు కట్టి రోజు మిగిలిన పిల్లలకి ఒక్కొక్కరికి చేసినట్టుగా ఈఅమ్మాయికీ సేవలు చేసింది అనసూయమ్మ.

ఆ అమ్మాయి ముఖంలో ఆనందానికి అవధులు లేవు. అంతస్థులు చూడకుండా ఆమె చేస్తున్న పనికి ఆమె భర్త, కొడుకు, మనవలు ఆనందించారు. రాజీ ముఖంలో భావాలు కనిపెట్టి ...

“చూసావా? ఆ పాప ముఖంలో ఆనందం. ఆ ఆనందంతో కలిగిన సంతృప్తికి విలువ కట్టగలమా? మనకి మనం ఎన్ని కొనుక్కున్నా ఇంతానందాన్ని పొందగలమా?” అన్నాడు నారాయణ. అత్తగారి ప్రవర్తనతో మారిన ఆలోచనలతో చూస్తూన్న రాజీకి మనసు ఆర్ద్రమై తనూ పాపకి మనస్ఫూర్తిగా పాదాభివందనం చేసింది.